అజంత గౌరీపూజ చేస్తోంది. అందాల అజంత పెళ్లికూతురు అలంకరణలో మరింత అందంగా మెరిసిపోతోంది.

శ్రావణి ఏదో వంకన నాలుగుసార్లు అటువచ్చి, కోడల్ని సంతృప్తిగా చూసి వెళ్లింది.

ఎవరో అంటున్నారు. "అదేమిటే, వియ్యపురాలు అన్నిసార్లు ఇటువైపు వచ్చిందీ... ఏమైనా మాట్లాడలేమో కనుక్కో మాలతీ..."

"వదినగారూ! కోడల్ని చూసి మురిసిపోవడానికి వస్తున్నారు. అంతకంటే ఏంలేదు." అజంత తల్లి మాలతి ఆనందంగా చెప్పింది.

"అవును, అజంతని ఎక్కడో పెళ్లిలో చూసిందట ఆవిడ. అంతే, కోడల్ని చేసుకోవాలని నిర్ణయించుకోవడం, అజంత నాన్నగారికి కబురు చేయడం పెళ్లి కుదరటం, అంతా నాలురోజుల్లో జరిగిపోయింది.

ఆవిడ నిర్ణయించుకోవడం సరే! అబ్బాయి కళాధర్‌కూడా తల్లిమాటను గౌరవించడం ఎంత అదృష్టమో అజంతది...

ఈ మాటలన్నీ శ్రావణి చెవుల్లో పడుతూనే ఉన్నాయ్!


ఇక బాగుండదు. ఇంకెంత పీటలమీదకు తీసుకువస్తారు. తను మరీ తొందరపాటు ప్రదర్శిస్తే... నవ్వుతారు! అని, పెళ్లిపందిట్లో ఉండిపోయింది.

శ్రావణి, తనను తాను కంట్రోల్ చేసుకుంటూ, జరిగినదంతా కళ్ల ముందు కదిలింది.

నిజమే! కళాధర్‌కి పెళ్లిచేయాలనే సంబంధం చూడాలనీ అనుకున్నారంతే! ఇంకా ఎవరినీ చూడలేదు. అదిగో బావగారిఅబ్బాయి పెళ్లికి, పెళ్లికొడుకు తరఫున వచ్చిన బంధువుల్లో అజంతను చూసింది తను. ఆ క్షణంలో ఈ పిల్ల నాకోడలు కావాలని కోరుకుంది.

# సంఘర్షణ

ఎ. అన్నపూర్ణ



అజంత తండ్రి, నా అంతగా నేను అడిగేసరికి ఉక్కిరిబిక్కిరై పోయారు. మాకు మీముందు నిల్చునే అర్హత లేదు. ఇక పెళ్లికి... నేను ఏమివ్వగలను, మీకు తగినట్టు ఎలా చేయగలనూ అంటూ ఊరికే కంగారు పడిపోయారు.

"మీరు అలాంటి భావం రానీకండి. అమ్మాయి మాకు నచ్చింది. ఇక మాకేమీ వద్దు. పెళ్లికి వప్పుకోండి అంటూ, భర్త చేత చెప్పించాక కూడా ఆయన కంగారుపడుతూనే ఉన్నారు. ఆయన భార్య మాలతి ఆయనను సంబాళించి, వప్పించింది. పెళ్లి అవుతూంది.

తన పెంపకంలో పెరిగిన కళాధర్ తనమాట కాదనడు. అయినా అమ్మాయికి వంక పెట్టే అవసరం ఏముందీ?

సంసారపక్షంగా చదువుకుంది. మంచి కుటుంబం నుంచి వచ్చింది. ఇంకేం కావాలి?

కళాధర్ పక్కన, అజంతా శిల్పంలా పేరుకి తగినట్టు ముచ్చట గొలుపుతుంది. తన ఫ్రెండ్స్, బంధువులూ, తనని ఒకటే పొగిడేస్తున్నారు.

శ్రావణీ! నీ సెలక్షన్‌కీ, ఏదైనా ప్రత్యేకత ఉండి తీరితుంది. 'కంగ్రాట్యులేషన్స్' అంటూ....

వారి మాటలు మరింత తృప్తినీ, ఆనందాన్నిచ్చాయామెకు.

పక్కనున్న భర్తతో చెప్పి ఎన్నిరకాలుగా అజంతను మెచ్చుకుందో...!

"బాలూ! ఆ శారీ చూడు, అమ్మాయికి ఎంత చక్కగా

నప్పిందో..."

"శారీ సరే! ఆ డైమండ్ నెక్లెస్? అమ్మాయి మెడకే అందాన్నిచ్చింది. ఇంకెవరికీ అంతలా సూటవుతుందని" అనుకోను.

అబ్బ అందమంతా ఆ పిల్లదే అనుకో....

"సరేనోయ్! మరీ అంతలా దిష్టి పెట్టకు. నీకు నచ్చిన అందమే అందం! నువ్వు మెచ్చిన గుణమే గుణం! ఈడూజోడూ చక్కగా ఉంది. మన కళాధర్‌కి సరిగ్గా సరిపోయే అందం..." అన్నాడు బాలసుబ్రమణ్యం.

అంతలో ఎవరో ప్రముఖులు వచ్చారని ఎదురెళ్లాడు బాలూ....

"మేడమ్! ఈ లెటర్ మీకిమ్మన్నారు" అంటూ, పదేళ్ల అబ్బాయి, ఓ లెటరు శ్రావణి చేతికిచ్చాడు.

లెటర్ ఏమిటీ...? ఎవరిచ్చారు? ఉండు... ఉండు అంటున్నా వినకుండా మాయమయ్యాడు ఆ కుర్రాడు.

శ్రావణి కవరు చించి, ఉత్తరం చదివింది. చుట్టూ జనం ఉండటంతో, చాటుగా వెళ్లి, మళ్లీ చదివింది. అంతే! ఆమె కళ్లు బైర్లు కమ్మాయ్! తలమీద ఏదో పెద్దబరువున్నట్టు ఫీలైంది.

చేతిలో ఉత్తరం ఆటంబాంబులా తోచింది.

ఇది నిజమా? లేక ఎవరైనా ఈ పెళ్లి జరగటం ఇష్టంలేని అసూయాపరులు సృష్టించిన తమాషాయా....?

అజంత ఈ పెళ్లి పట్ల సంతోషంగా లేదా? తను సిగ్గు, బిడియం అనుకుంటుంది. అది కాదా?

తమంత గొప్పవాళ్లు అడిగారని అజంత తండ్రి, అమ్మాయి ఇష్టాన్ని పట్టించుకోకుండా, తలవంచి చేస్తున్నాడా?

అసలు ముందు, తనెందుకు ఆలోచించలేదూ....?

నిజమే! తనూ, కొడుకూ ఇష్టపడితే చాల్తా?

అమ్మాయిని అడగాలని ఎందుకు తోచలేదు?

ఇప్పుడు ఏం చేయాలి? అదిగో పెళ్లికూతుర్ని, మేనమామలు పీటలమీదకు తీసుకువస్తున్నారే... ఇప్పుడే పెళ్లి ఆపుచేయాలా? కొనసాగనివ్వాలా?

తెలిసి చేస్తే, కళాధర్ సుఖపడలేడేమో......

అలా అని, పీటలమీద పెళ్లి ఆపుచేస్తే, ఇంతమందిలో ఎంత అప్రతిష్ట?

ఒక్కవుదుటున అజంతను నిలేస్తే? చెబుతుందా?

ఈ ఉత్తరం రాసిన అబ్బాయి ఎవరు? ఎవరు అయినా తెలిస్తే, కళాధర్ బదులు అతన్ని పెళ్లిపీటలమీద కూర్చోపెట్టి, పెళ్లి చేస్తాను. కానీ.... ఇలా ఎవరితోనో పంపించాడంటే ఎలా నమ్మడం? నిజంగా అజంతా, అతనూ ఒకరినొకరు ఇష్టపడితే... తాను పెళ్లి చేయగలదు. నిజమే అయితే అతను తనంతట తను, నన్ను కలిసి చెప్పవచ్చునే... భయపడ్డాడా? అనేక ఆలోచనలు చుట్టుముట్టగా

ఏం చేయాలో పాలుపోని శ్రావణి, స్థాణువులా ఉండిపోయింది.

అమ్మా! పెళ్లికుమారుడి తల్లిగారు వెంటనే రావాలి... ఎవరో పిలుస్తున్నారు... తప్పదు వెళ్లాలి. ఇక్కడే ఉంటే తనకోసం అంతా వెదకటం ప్రారంభిస్తారు.

ఒక్క క్షణం ఆలోచించి, ఆ ఉత్తరాన్ని చించి ముక్కలు చేసి, అక్కడే ఉన్న చెత్తబుట్టలో పడేసి, ఏమీ ఎరగనట్టు వెళ్లి కూర్చుంది.

"శ్రావణీ ఎటెళ్లావ్... భలేదానివి! మన కంపెనీ ఛైర్మన్‌గారు వచ్చారు. ఆయన భార్య నీగురించి అడుగుతున్నారు...." అంటూ

## మనసు 'లోగిలి'



"ఈ లోకంలో కొందరికి
ఆడది త్రీ ఇన్ వన్ సెట్
నైటీ కడితే
శృంగారయంత్రంలా పనికొస్తుంది
వాయిల్ చీర కట్టి వంటింట్లో పెడితే పిండి వంటలూ కోరిన
రుచులూ సృష్టించే కుక్కర్‌లా పనికొస్తుంది.
ఇస్త్రీ చీర కట్టి రిక్షా ఎక్కిస్తే ఆఫీసుకెళ్లి బుద్ధిగా పని చేసి నెలకింత
జీతం రాళ్లు తెచ్చి చేతిలో పోస్తుంది"
అంటారు ఓ రచయిత్రి ఆవేదనతో...

### ఇది అక్షరాలా నిజమే!

స్త్రీల ఇష్టానిష్టాలతో పనే లేని పాశవికనైజం నేటికీ కొనసాగుతున్నది.
"భర్త ఇలా వుంటే బావుండు" అనుకోవడం, "ఉండాలి" అని
ఆశించడం ఓ అందమైన కలగా మాత్రమే
మి... గి... లి... పో... తో... ం... ది.
ఇలాటి కలలను మేం ప్రచురించదలిచాం. మనసున్న ఏ మగడైనా ఇవి
చదివి
"ఆడాళ్లంటే కొలతల్లో ఇమిడే అవయవసౌష్ఠవాలే కాదు, వాళ్లకంటూ
కొన్ని ఆశలూ, ఊహలూ, ఆవేదనలూ వుంటా"యని గ్రహిస్తే చాలు.
రాత్రి పదింటికే నిద్రలోకి జారి నిర్వేదంగా గడిపే భర్తలకూ, రిమోట్
కంట్రోల్ పట్టుకుని నిద్రొచ్చే వరకూ టీవీ ఛానల్ అలలపై కళ్లను
ఆరేసుకుని నిద్రలోకి జారే ఎందరో ఇల్లాళ్లకూ ఈ శీర్షిక ఎడారిలో
ఒయాసిస్ లాటిది.

**ఇది సెక్స్ ఉద్రేకాలు రెచ్చగొట్టే శీర్షిక కాదు.**
**ఈ తరం ఇల్లాళ్ల మనసులోని మర్మాన్ని**
**తెలుసుకునే సోషియో సైంటిఫిక్ ఫ్యామిలీ ఫీచర్**

**దీనికి మీ మనోభావాలు పంపండి**

బాలూ, శ్రావణి ముఖంలోకి చూసి ఆమెలో మునుపటి ఉత్సాహం లేకపోవడంతో,

"శ్రావణీ! అదోలా ఉన్నావేం" అన్నాడు.

"ఏం లేదయ్యా బాలూ... నేను బాగానే ఉన్నాను...." అంటూ తప్పించుకుంది.

కళాధర్, అజంత మెడలో మూడుముళ్లు వేసేశాడు.

వారం తిరక్కుండా, అజంతను తీసుకువచ్చి, అప్పగించి వెళ్లారు అజంత అమ్మానాన్నలు.

కొత్తదంపతులు హనీమూన్ వెళ్లి, నెలరోజులపాటు తిరిగి ఇంటికి వచ్చారు. ఆ ఏర్పాట్లన్నీ బాలూయే చూసుకున్నాడు.

ఎందుకో శ్రావణి అజంతతో ముఖావంగా ఉంటోంది.

తాను ఏరికోరి పెళ్లి చేసి, ఇలా హఠాత్తుగా ఎందుకు మారిపోయిందో, బాలూకి అంతుపట్టలేదు.

"శ్రావణీ! నాతో చెప్పవా? నువ్వెందుకో బాధపడుతున్నావ్. పెళ్లిలో ఎవరైనా ఏమైనా అన్నారా? సుమన్‌గానీ, మాలతీగానీ నిన్ను అవమానించారా? నాకేమీ అర్థం కావడంలేదు.

"అహ... ఏంలేదు బాలూ. నన్ను, ఎవరూ ఏమీ అనలేదు కానీ, ఇంతకాలం ఎంతో ప్రేమగా చూసుకున్న కళాధర్‌ను ఇకనుంచి అజంత తనవైపు లాక్కెళ్లినట్టు తోచింది!" అంటూ అబద్ధం చెప్పింది మొదటిసారిగా భర్తతో.

అయితే అవునేమో! ఒక్క కొడుకున్న తల్లికి, బిడ్డపైన ఉండే అతిప్రేమ వలన, కోడలు రాగానే, తన సొత్తు, స్వంతం చేసుకుందనే అసూయ కలుగుతుందని విన్నాడు. అందువలన శ్రావణి ముభావంగా ఉందేమో!

కొద్దిరోజుల్లో, తనే సర్దుకుపోతుందిలే... అనుకున్నాడు బాలసుబ్రమణ్యం.

భార్య మోజులో కళాధర్ తల్లిని అంతగా పట్టించుకోలేదు.

అత్తగారితో, అణకువగా, గౌరవంగా ఉంటోంది అజంత.

ఆ అమ్మాయి చేయాల్సిన పన్లూ ఏమీ ఉండవు. నలుగురు పనివాళ్లు, భర్తతో ఎటైనా వెళ్లడం తప్పితే, బుక్స్ చదవడం అంతే!

అత్తగారు అవసరానికి మించి మాట్లాడదు.

మామగారు బాగానే ఉంటారు కానీ ఆయనకు కంపెనీ వర్క్‌తో తీరికే ఉండదు.

శ్రావణి పేరున మరో ఉత్తరం వచ్చింది. అదే రైటింగ్, కానీ ఈసారి మొదటిదానికే దీనికీ తేడా ఉంది.

అమ్మా! మీరు అజంతను కోడలుగా ఎన్నుకుని చాలా పొరబాటు చేశారు. ఇంతకు ముందే నేనూ, ఆ అమ్మాయి గాఢంగా ప్రేమించుకున్నాం. కానీ కథ మామూలే! 'కులం' అడ్డుగోడగా నిల్చి, మమ్మల్ని దూరం చేసింది. తర్వాత జరిగే పరిణామాలకి సిద్ధంగా ఉండండి... అని, మొదటి ఉత్తరంలో రాసి ఉంది.

శ్రావణిగారూ! మీరు పెళ్లిపందిట్లో, నా ఉత్తరం, హెచ్చరికా కూడా నిర్లక్ష్యం చేసి, అజంతను కోడలిగా స్వీకరించారు. మీకోడలు, నేనూ అప్పుడప్పుడు కలుసుకుంటూనే ఉన్నాం. పెళ్లి అయిపోతే నాకు కనిపించదేమో అనుకున్నాను. కానీ అదృష్టవశాత్తు నాకీ ఊరు ట్రాన్స్‌ఫర్ అయింది. పెళ్లికి ఎందుకు అంగీకరించావని అజంతను నిలదీస్తే, 'పిచ్చివాడా! పెళ్లి అయినందువలన ఒకరకంగా నన్ను ఎవరూ నిందించరు. 'అత్తవారిల్లు' అనే గొడుగు, నాకు రక్షణగా ఉంటుంది. వీలున్నప్పుడల్లా, మనం కలుసుకుందాం. నాకోసం ఆ మాత్రం ధైర్యం చేయగలవని నాకు తెలుసు' అంటూ చెప్పింది. అది, అక్షరాలా నిజం. మీవంటి మంచివారి అండ మాకు శ్రీరామరక్ష.



ఇలా రెండో ఉత్తరంలో రాసి ఉంది.

అంటే, ఇదేదో తేలికగా తీసుకోవలసిన విషయంకాదు. అజంతా, ఆమె ప్రేమికుడు మమ్మల్ని చాలా పకడ్బందీగా మోసం చేస్తున్నారు. అజంతను పట్టించుకోకుండా తను దూరంగా ఉండటంతో, ఆ అమ్మాయి ఎటు వెడుతుందో, ఎప్పుడు బైటకు వెడుతుందో తెలియలేదు. రోజూ లైబ్రరీకి బుక్స్ కోసం వెడుతుంది. ఆ వంకన మాజీ ప్రియుడితో గడుపుతోందా? ఎంత ద్రోహం? తను, తెలిసీ ఊరుకోవడం చాలా పొరబాటైపోయింది.

శ్రావణి, అజంత బైటకు వెళ్లినప్పుడు ఓ వారంరోజులు, ఆమెను గమనించింది. కానీ, ఆ అమ్మాయి, లైబ్రరీకి మాత్రమే వెళ్లడం తెలుసుకుంది.

ఛ.... తను, అనవసరంగా ఆకాశరామన్న ఉత్తరం చూసి, అజంతను, అనుమానించింది. అది నిజంకాదు. అజంత అటువంటి తప్పుపని చేయదు. పెళ్లికి ముందు ఎవరినైనా ఇష్టపడి ఉండవచ్చు. కొన్ని కారణాలవలన పెద్దలు మందలించి ఉండవచ్చు. అంతమాత్రనా ఆ అమ్మాయిని శంకించడం పొరబాటు కాదా?

అందమైన ఆడపిల్ల వెనుక, కొన్ని చెప్పుకోలేని సంఘటనలు జరుగుతాయి. అంత తొందరగా, అమ్మాయిలు లొంగరు. తమ జాగ్రత్తలో తాముంటారు. మన సంస్కృతీ, సంస్కారం, ఆడపిల్లకు పుట్టుకనుంచే స్వీయరక్షణను నేర్పుతుంది. అంతేకాక కుటుంబ పెద్దలు, తమ సంతానాన్ని సక్రమంగా పెంచుతూ, వేయికళ్లతో కాపాడుకుంటారు.

ఎవరో అనామకుడు, అజంత మీద ద్వేషంతో, తనను కాదన్నదనే కోపంతో, ఈ విధంగా కల్పించి ఉత్తరాలు రాసి ఉండవచ్చు.

కాలేజీలో చదివే రోజుల్లో ఎంతోమంది వెంటపడ్డారు. అయినా తను చలించలేదు. యూనివర్సిటీలో మహేంద్రా, తనూ మంచి ఫ్రెండ్స్. ఒకరివట్ల మరొకరికి ఆరాధనా భావం.

ఇది తెలిసి అమ్మా, నాన్న మహేంద్రను అడిగారు. 'పెళ్లి చేసుకుంటారా' అని!

అందుకు మహేంద్ర, తన కుటుంబం చాలా పెద్దదనీ, తనే వారికి ఆధారమనీ, మా పెళ్లి వలన, వారికి దూరం కావలసి వస్తుందనీ, నిరాకరించాడు.

తనతో, 'శ్రావణీ! నన్ను క్షమించు, నీమీద విపరీతమైన ప్రేమవున్నా, అసహాయుణ్ణి. ఈ ఆరాధన మనసుకు సంబంధించినదే. కాని, శారీరకావసరం కాదు. గౌరవంగానే విడిపోదాం' అంటూ చెప్పి, వెళ్లిపోయాడు.

ఆ తర్వాత అతను కనిపించనే లేదు.

కనిపించినా, తాము మంచి స్నేహితులే...! అదొక మధురస్మృతి. ఈ ఆలోచన తనకు ముందే వచ్చివుంటే, ఈ మానసిక సంఘర్షణ ఉండేదికాదు.

ఒక స్త్రీగా, తోటి ఆడపిల్లను, అర్థం చేసుకుంటే, అత్తగారిలో అమ్మనే చూడగలదు కోడలు.

ఇక, ఎలాంటి ఉత్తరాలు వచ్చినా చదవాల్సిన అవసరం లేదు. 'నిర్మల తటాకాన్ని కదల్చే అలలు వస్తూంటాయి... చిన్న గులకరాయి తాకితే చెదరినా, నీటి స్వచ్ఛత ఎన్నటికీ కోల్పోదు.'

విచిత్రంగా ఆ తర్వాత శ్రావణికి ఆకాశరామన్న ఉత్తరాలు రానేలేదు. ఆ క్షణం నుంచీ, శ్రావణీ, అజంతలు మంచి స్నేహితులు అయిపోయారు.

■